క్లుప్తంగా

కొనసాగుతున్న వేసవి శిబిరం



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో వేసవి శిబిరం కొనసాగుతోంది. గత వారం నుంచి విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొంటున్నారు. పీఈటీ రామేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలో పాల్గొనడానికి విద్యార్థులు పోటీ పడ్డారు. ప్రతీరోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వేసవి శిబిరం ఉంటుందని పీఈటీ తెలిపారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఈవో కృష్ణపాల్

బజార్‌హత్నూర్: వానాకాలం ఖరీఫ్ సాగు ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులు విత్తనాలు కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో కృష్ణపాల్ పేర్కొన్నారు. మండలంలోని కాండ్లి పంచాయతీ పరిధిలోని మోహద గ్రామంలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, గడ్డి మందులు కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. పంట సాగులో మెలకువలు పాటించి పంట మార్పిడి చేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. పట్టా పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. గ్రామపటేల్ బిక్కు, రైతులు కిష్టు, శంభు, కొడప మనోహర్, కుమ్రం కృష్ణ, పాండు, పంద్రం ప్రకాశ్ పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్లతో సీఐ సాయినాథ్, సిబ్బంది

భీంపూర్: మండలంలోని అంతర్గం శివారులో పెన్‌గంగా నది వద్ద ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు సీఐ డి.సాయినాథ్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి లేకుండా పెన్‌గంగా నుంచి మహారాష్ట్రకు ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు, అంతర్గంలో అక్రమ ఇసుక డంపు నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐతోపాటు ఎస్సై పీర్‌సింగ్, సిబ్బందిని డీఎస్పీ జీవన్‌రెడ్డి అభినందించారు.

అకాలవర్షంతో జొన్న రైతుల ఇక్కట్లు



ఇచ్చోడ: అకాల వర్షంతో జొన్న రైతులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురిసింది. వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్నలను విక్రయించడానికి రైతులు తీసుకురాగా, వర్షం కురవడంతో పంటలను కాపాడుకునేందుకు టార్పాలిన్లు కప్పారు.

‘అడ్వొకేట్‌పై కేసు నమోదు సరికాదు’

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఎక్స్‌రోడ్డు, హనుమాన్‌నగర్ గ్రామ పెద్ద, అడ్వొకేట్ జగన్‌పై పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదని గ్రామస్తులు బానోత్ రంగీబాయి, బానోత్ విజయ, జాదవ్ బాపురావు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ భవన్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించామన్నారు. దాని పక్కన నివాసం ఉన్న మేఘనాథ్ ఆ స్థలాన్ని అక్రమించడంతోపాటు సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేశారన్నారు. దీనిపై గ్రామస్తులందరూ ప్రశ్నించడంతో ఆ కుటుంబం దుర్భాలాషలాడిందన్నారు. పైగా క్షుద్రపూజలు చేస్తూ పట్టుబట్టడంతో వీరిపై కేసు నమోదయ్యాయన్నారు. ఇటీవల తన కుమారుడు పవన్ వివాహం జరగగా గ్రామస్తులు రాకుండా జగనే ఆపాడని ఆయనపై కేసు నమోదు చేయించారన్నారు. సమావేశంలో గ్రామస్తులు పద్మ, శేషరావు, అంబాజీ, శ్యాంరాఉవ, రవీందర్, ప్రసాద్, జశ్వంరరావు, భీముడు, శంకర్ పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. ఎదురుచూపులే

- కలగానే ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- అగ్నిమాపక కేంద్రం కరువు
- ఊసే లేని మినీస్టేడియం



స్టేడియం నిర్మించాలని ధర్నా చేస్తున్న యువకులు(ఫైల్)



మార్కెట్ కమిటీ కార్యాలయ భవనంలో కొనసాగుతున్న ట్రెజరీ కార్యాలయం

బోథ్: నియోజకవర్గ కేంద్రమైన బోథ్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఏళ్లుగా సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఎన్నికల్లో హామీలు గుప్పించిన నాయకులు సమస్యలను తీర్చడంలో విఫలమవుతున్నారు. ఎస్టీ నియోజకవర్గమని చిన్నచూపు చూస్తున్నారా...లేక అభివృద్ధి చేయాలన్న ఆలోచన రావడం లేదా అంటూ ప్రజలు ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. మంత్రులు తమ నియోజవర్గాలను అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నారే కానీ బోథ్‌కు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

పత్తా లేని డిగ్రీ కళాశాల

బోథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదు. అనేకసార్లు ప్రజాప్రతినిధులు, నాయకులు త్వరలోనే డిగ్రీ కళాశాల మంజూరు కాబోతోందని చెప్పిన సందర్భాలు ఉన్నాయి. తెలంగాణ వచ్చి పదేళ్లు గడుస్తున్నా కళాశాల ఊసే లేదు. నియోజకవర్గ కేంద్రంలో ఆదివాసీలు, గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. గిరిజన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసించాలంటే నిర్మల్, ఆదిలాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బోథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తే బోథ్‌తో పాటు నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాల విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసించడానికి వీలుంటుంది.

స్టేడియం లేక ఆటలకు దూరం

నియోజకవర్గ కేంద్రమైనా ఒక్క స్టేడియం లేదు. క్రీడాకారులు ఆడుకోవడానికి స్టేడియం లేకపోవడంతో వారు ఆటలకు దూరమవుతున్నారు. గతంలో మినిస్టేడియం నిర్మాణం కోసం అధికారులు కనుగుట్ట శివారులో స్థలాన్ని పరిశీలించారు. మళ్లీ సాకెర వద్ద పరిశీలించినా.. నిర్మాణం మాత్రం జరగడం లేదు.

ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు కరువు

నియోజకవర్గ కేంద్రంలో ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. కానీ వాటికి భవనాలు లేవు. శిథిలావస్థ, అద్దె భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. సబ్ ట్రెజరీ కార్యాలయం ఇంతకుముందు తహసీల్దార్ కార్యాలయం పక్కనే కొనసాగుతూ ఉండేది. శిథిలావస్థకు చేరి కూలడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఓ భవనంలో కొనసాగుతోంది. తహసీల్దార్ భవనం శిథిలావస్థకు చేరింది. నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయంలో కొనసాగుతోంది. కాగా, పంచాయతీరాజ్ కార్యాలయంతోపాటు పలు కార్యాలయాలు భవనాలు లేక ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిపోయాయి.

హామీలకే అగ్నిమాపక కేంద్రం

అగ్నిమాపక కేంద్రం మంజూరంటూ ప్రగల్భాలు పలుకుతూ ప్రజలను నాయకులు మోసం చేస్తున్నారే తప్ప ఏర్పాటు చేయడం లేదు. గతంలో బోథ్‌లోని మహాలక్ష్మి ఆలయం వద్ద, పిప్పల్‌ధరి వెళ్లే దారిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని స్థానిక గ్రామపంచాయతీ చూపించింది. అయితే ఇప్పటివరకు కేంద్రం ఏర్పాటుకు ఒక్క అడుగు కూడా పడలేదు నియోజకవర్గ కేంద్రంలో గతంలో పలుమార్లు అగ్ని ప్రమాదాలు సంభవించాయి. విలువైన మిషన్ భగీరథ పైపులు గతంలో కాలి బూడిదయ్యాయి. ఆస్తులు బుగ్గవుతున్నా నాయకులు పట్టనట్లు ఉంటున్నారు.

అభివృద్ధికి పాటుపడాలి



అగ్నిమాపక కేంద్రం, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిని స్టేడియాన్ని ప్రభుత్వం నిర్మించాలి. అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. ప్రజా ప్రతినిధులు బోథ్ అభివృద్ధికి పాటుపడాలి.

– డోపికర్ విక్రమ్, బోథ్

బీర్సాయిపేట అటవీ ప్రాంతంలో పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బీర్సాయిపేట రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జెడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎఫ్‌డీవో రేవంత్ చంద్రతో కలిసి పర్యటించారు. అక్కడ ఉన్న బేస్‌క్యాంప్‌ను సందర్శించారు. బీర్సాయిపేట రిజర్వ్ ఫారెస్ట్‌లో బుద్ధ పూర్ణిమ సందర్భంగా పర్యటించి మూన్ లైట్‌ను చూశారు. చందమామ వెలుగులో అధికారులతో కలిసి అడవిలో నడుచుకుంటూ వెళ్లారు. జంతువుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. జంతువులు, అటవీ సంరక్షణను అందరు బాధ్యతగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. నాయకులు ప్రీతం రెడ్డి, రవీందర్ రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, రాహుల్‌ముండే, ఇంద్రవెల్లి మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీరాం, బీర్సాయిపేట ఎఫ్ఆర్‌వో అరుణ, బీట్ అధికారి అజయ్, ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నేరడిగొండ: బోథ్ మండలం మందబోగడ గ్రామానికి చెందిన పెంట లక్ష్మికి రూ.26వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో అందజేశారు. మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జొన్న రైతుల పడిగాపులు



మార్కెట్ యార్డులో జొన్న పంట

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు వద్ద జొన్న పంట కొనుగోలు కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. యార్డులో పంట కొనుగోలు నిల్వలు ఉన్నందున రెండురోజులుగా వేచిచూస్తున్నారు. పంటను తీసుకువచ్చిన వాహనానికి అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో యార్డుకు రావాల్సి వచ్చిందని తరోడా గ్రామానికి చెందిన రైతు సంతోష్ తెలిపారు. జైనథ్ ఉమ్మడి మండలంలో సుమారు 17,674 ఎకరాల్లో జొన్న సాగు చేశారు. అందులో ఇప్పటివరకు 5,461 క్వింటాళ్ల జొన్న కొనుగోలు చేశామని అధికారులు తెలిపారు. కాగా, జైనథ్ ఏవో పూజ వివరణ కోరగా రైతులకు కేటాయించిన తేదీల్లో మార్కెట్ యార్డుకు పంట తీసుకురావాలన్నారు. ఇతర తేదీల్లో తీసుకురావడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రైతులు అధికారులకు సహకరిస్తే సకాలంలో కొనుగోలు పూర్తవుతాయని పేర్కొన్నారు.

నేడు కొనుగోళ్లు నిలిపివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జొన్న కొనుగోలు నిలిపివేస్తున్నట్లు సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. జొన్న నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం యథావిధిగా రైతులు జొన్న పంటను మార్కె ట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు.

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురు, శుక్రవారాల్లో జొన్న కొనుగోలు నిలిపివేస్తున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. జొన్న నిల్వలు ఎక్కువగా ఉండడం, వాతావరణం కారణంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు ప్రారంభం తేదీని త్వరలో ప్రకటించే వరకు మండల రైతులు జొన్నలను మార్కెట్‌యార్డుకు తీసుకురావద్దని సూచించారు.

గుండె ఆపరేషన్లు ప్రారంభించాలని ధర్నా



ధర్నా చేస్తున్న విజయ్‌కుమార్

కైలాస్‌నగర్: పట్టణంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో తక్షణమే గుండె ఆపరేషన్లు ప్రారంభించాలని పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన నక్క విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా కేంద్రంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన అధునాతన భవనంతోపాటు అన్ని వసతులు ఉన్నప్పటికి గుండె జబ్బులకు సంబంధించి ట్రీట్‌మెంట్ మాత్రం అందడం లేదన్నారు. దీంతో రోగులు హైదరాబాద్, యావత్మాల్, నాగ్‌పూర్ వంటి ప్రాంతాలకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గుండెనొప్పితో అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన వారు చికిత్స అందక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రిమ్స్‌లో ఆపరేషన్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సుస్థిర వ్యవసాయం దిశగా కృషి చేయాలి

- కేవీకే శాస్త్రవేత్త సునీల్ కుమార్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా.జి. మంజుల

ఆదిలాబాద్‌రూరల్: సుస్థిర వ్యవసాయం దిశగా రైతులు కృషి చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మండలంలోని బూర్నూర్‌లో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడి చేస్తూ ఎక్కువ దిగుబడితో సుస్థిర వ్యవసాయ దిశగా అడుగులు వేయాలన్నారు. సాగులో తీసుకోవాల్సిన యజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, తక్కువ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎ.పోశాద్రి మాట్లాడుతూ రైతులు ఇంటికి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పేర్కొన్నారు. పంట మార్పిడి చేపట్టి బలవర్ధకమైన ఆహార పంటలను సాగు చేయాలని సూచించారు. ఏవో నగేష్ రెడ్డి, మండల పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, ఏఈవో నివేదిత, రైతులు పాల్గొన్నారు.

పంటల మార్పిడితోనే అధిక దిగుబడి

ఉట్నూర్‌రూరల్: పంటల మార్పిడితోనే అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్త డా.జి.మంజుల సూచించారు. మండలంలోని దంతన్‌పల్లిలో వ్యవసాయ కళాశాల ఆదిలాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్త కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, జిల్లా ఉద్యాన అధికారులు, వెటర్నరి అసిస్టెంట్, ఎన్జీవో ప్రతినిధులు, ప్రజాప్రతినిదులు, రైతుల పాల్గొన్నారు.

నేడు రైతు ముంగిట్లో శాస్త్రవేత్త కార్యక్రమం

నేరడిగొండ: మండలంలోని కుమారి రైతు వేదికలో బుధవారం ఉదయం 8 గంటలకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్త కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో కృష్ణ వేణి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని కోరారు.

లోఓల్టేజ్ సమస్య తలెత్తకుండా చర్యలు



పిప్పల్‌కోటిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈ హరికృష్ణ, ఏఈ తిరుపతిరెడ్డి

తాంసి: గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ హరికృష్ణ తెలిపారు. సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా భీంపూర్ మండలంలోని భీంపూర్, పిప్పల్‌కోటి ఏర్పాటు చేసిన 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను సిబ్బందితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆరు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఏఈ తిరుపతిరెడ్డి, సబ్ ఇంజినీర్ వినయ్, లైన్‌మెన్ శౌకత్, సిబ్బంది రవీందర్, భాస్కర్, రాజశేఖర్ ఉన్నారు.

ముగిసిన పెర్సపెన్ పూజలు



పెర్సపెన్‌కు పూజలు చేస్తున్న ఆదివాసీలు

నార్నూర్: మండలంలోని ఖైరడట్వాలో బావై మాసంలో జరుగుతున్న సూర్యవంశీ రాజ్ గోండ్ మేడ్నికార్ పెందోర్ వంశీయుల పెర్సపెన్ పూజలు మంగళవారంతో ముగిసింది. మూడు రోజులు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివాసీల్లో నాలుగు సగలో ప్రతి ఒక వంశలో పెర్సపెన్ ఉంటాయని కటోడా పెందోర్ గంగు పేర్కొన్నారు. పూర్వం నుంచి ఆచారంతో తీసుకొస్తున్న పెర్సపెన్ దేవుళ్లు, ఈసారి మేడ్నికార్ పెందోర్ వంశం పెర్సపెన్ 15 తుమ్ములు మొక్కలు తీర్చుకున్నారని తెలిపారు. ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సంతోష్, కటోడా పెందోర్ గంగు, సీలాసావ్ పెందోర్, అర్జున్ పెందోర్, చందు పెందోర్, ఆనందరావు, తుకారాం పటేల్, పెందోర్ బొజ్జు, ధర్ము, గ్రామపటేల్ తానాజీ, సారమేడి తుకారాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: బొల్లారపు బాబన్న రచించిన ‘కొంచమైతే వెలుతురే’అనే పుస్తకాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించనున్నట్లు బాబన్న ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కవులు నారాయణ, వసంత్‌రావు దేశ్‌పాండే, సంతోష్ కుమార్, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, టీఎన్‌జీఓ అధ్యక్షుడు అశోక్ తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కవులు, కళాకారులు హాజరుకావాలని కోరారు.

ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న బాలు, తదితరులు

నార్నూర్: ఏజెన్సీ చట్టాలను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని, లేకపోతే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో జవహర్‌లాల్, తహసీల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గతంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గిరిజనేతరులు ఎలాంటి అనుమతి లేకుండా ఏజెన్సీ ప్రాంతాల్లో భవనాలు నిర్మిస్తుంటే నోటీసు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీ తప్పిదాల వల్ల అర్హులకు ఇల్లు మంజూరు కాలేదని అన్నారు. కమిటీలను రద్దుచేసి అధికారులతో ప్రత్యేక సర్వే చేయించి అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మండల ప్రధాన కార్యదర్శి అరక గోవింద్, మండల అధ్యక్షుడు పుసం రెడ్డి ఈశ్రు, సెడ్మాకి రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, నాయకుడు జాలిమ్ షావ్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై అక్రమంగా బోరువెల్

- కూల్చివేసిన బల్దియా అధికారులు



కూల్చివేసిన బోర్‌వెల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్ కాలనీలో మహ్మద్ ఆరీఫ్ నిబంధనలకు విరుద్ధంగా నడిరోడ్డుపై వేసిన బోర్‌వెల్‌ను బల్దియా సిబ్బంది కూల్చివేశారు. మున్సిపల్, సంబంధితాధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా సీసీ రోడ్డు మధ్యలో దర్జాగా బోరు వేశాడు. వద్దని కాలనీవాసులు చెప్పినా వినకుండా సోమవారం అర్ధరాత్రి దర్జాగా పనికానిచ్చేశారు. సీసీ రోడ్డును ధ్వంసం చేసి బోరువెల్ వేయడంపై కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బల్దియా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి బోరుబావిని కూల్చివేయించారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు పట్టణ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులను సంప్రదించగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని యూనియన్ జిల్లా కార్యాలయంలో మంగళవారం సమ్మె పోస్టర్లు, బుక్‌లెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా ప్రతిఘటించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయడానికి వ్యవసాయ చట్టాలను మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను అమ్మేస్తూ కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తోందన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి స్వామి, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పొచ్చన్న, జనార్దన్, నాయకులు రమేశ్, గంగారాం, కుమార్, అరవింద్, అరుణ్, మహేందర్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభివృద్ధే లక్ష్యం

ఇచ్చోడ: అణగారిన వర్గాల అభివృద్ధే ధర్మసమాజ్ పార్టీ లక్ష్యమని అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. లక్ష కిలోమీటర్ల రథయాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని ముఖరా(బి)లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది శాతం లేని రెడ్డి, రావులు తెలంగాణలో అధికారాన్ని శాసిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో అత్యధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు రాజ్యాధికారం సాధించాలన్నారు. జేఏసీ రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మన్, భూమన్న, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లో 40 చొప్పున సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరామర్శ

జైనథ్: మండలంలోని కంటలో ప్రణీత రోడ్డు ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా మంగళవారం బాధిత కుటుంబసభ్యులను మాజీమంత్రి జోగు రామన్న పరామర్శించారు. భోరజ్ మండలం బాలాపూర్‌లో రైతు ప్రవీణ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శ్రద్ధాంజలి ఘటించారు.

రైతులకు అవగాహన

సిరికొండ: మండలంలోని రైతు వేదికలో వ్యవసాయ అధికారులు రైతులకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా దుక్కులు దున్నుకోవాలని, విత్తనాలను తీసుకునేటప్పుడు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఏఈవో ప్రవీణ్ సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

నేరడిగొండ: ఇస్పూర్, తర్నం(బి) గ్రామాల్లో మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు.

ఎస్సైని కలిసిన బీజేపీ నాయకులు

తాంసి: భీంపూర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పీర్‌సింగ్ నాయక్‌ను బీజేపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీసుస్టేషన్‌లో ఆయన్ను సన్మానించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రాకేశ్ యాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గజానన్ యాదవ్, గుర్ల నారాయణ, అరుణ్ తదితర నాయకులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ స్థలం పరిశీలన

సిరికొండ: మండలానికి మంజూరైన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ కోసం స్థలాన్ని టీజీఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ చవాన్, తహసీల్దార్ తుకారం మంగళవారం పరిశీలించారు. త్వరలో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.